క్లుప్తంగా

21న గానాల రామమూర్తి జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 21వ తేదీన బ్రహ్మశ్రీ రావుసాహెబ్ పండిత గానాల రామమూర్తి 131వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు బీసీ నేతలు తెలిపారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన జయంతి సన్నాహక సమావేశంలో నేతలు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మికాంతయ్య, పార్వతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామమూర్తి జయంతిని రాజకీయాలకు అతీతంగా విశ్వ బ్రాహ్మణులు ఐకమత్యంగా జరుపుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఉత్సవ కమిటీ కన్వీనర్లుగా వడ్ల శ్రీనివాసులు, సుమంత్ ఆచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆటలతో మానసికోల్లాసం

కర్నూలు(సెంట్రల్): పిల్లలకు ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. ఆదివారం జోహరాపురం షరీక్ నగర్‌లో సుందరయ్య స్ఫూర్తి కేంద్రంలో యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ మాస్టర్ టి.శ్రీనివాసులు సహకారంతో మాస్టర్ సుధాకర్ పిల్లలకు కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆటలలో ప్రావీణ్యం ఉన్న వారికి శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు శారీరక దృఢత్వంతో జీవితంలో ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కోవడానికి మనోబలం సిద్ధిస్తుందన్నారు. కాగా, ఈ గ్రేడింగ్‌లో మొత్తం 38 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 9 మందికి ఆరెంజ్, 9 మందికి గ్రీన్, 12 మందికి బ్లూ, 10 మంది మెరిన్ రెడ్ బెల్టులు సాధించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ వినోద్, రాజశేఖర్, రంగప్ప పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



నజీమున్

కర్నూలు కల్చరల్: కర్నూలుకు చెందిన రెడ్డి నజీమున్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఫార్మసుటికల్ సైన్స్ విభాగంలో 'సాలిబిలిటీ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఆఫ్ పూర్లీ వాటర్ సాలిబుల్ టెల్మిసార్టన్ అండ్ లర్క్యానిడ్ పైన్ హెచ్.సి.ఎల్ అన్ టి హైపర్ టెన్సివ్ డ్రగ్స్ యూజింగ్ మిక్సడ్ పాలిమర్స్' అనే అంశంపై పరిశోధన చేసినట్లు చెప్పారు. రాజంపేట అన్నమాచార్య ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అవార్డు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆమె ప్రస్తుతంహైదరాబాద్‌లోని విజయ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ పొందిన నజీమున్‌కు కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ



తిరుప్పావడ సేవలో లలితా పీఠం భక్తులు

కర్నూలు కల్చరల్: ధనుర్మాస పూజల్లో భాగంగా స్థానిక లలితా పీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నం, చిత్రాన్నాం, పులిహోరా, కరివేపాకు, పెరుగన్నం, తీపి పొంగలి, కారం పొంగలి, పనీర్, జాంగీరు, నిప్పట్లు, చెకోడి తదితర ఆహార పదార్థాలతో స్వామి వారి రూపాన్ని తయారు చేసి నైవేద్యంగా నివేదించారు. ఆ నైవేద్య ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. తిరుప్పావై విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పీఠాధిపతులు మేడ సుబ్రహ్మణ్య స్వామి భక్తులకు సందేశం ఇచ్చారు.

హాకీ విజేత మాంటిస్సోరి పాఠశాల

కర్నూలు(టౌన్): సెవెన్ ఎసైడ్ హాకీ టోర్నమెంటు విజేతగా మాంటిస్సోరి పాఠశాల నిలిచింది. ఆదివారం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలను నిర్వహించారు. ఫైనల్‌లో ఎస్‌టీబీసీ కాంపౌండ్ జట్టుపై 3-1 గోల్స్ చేసి విజయం సాధించింది. విజేతకు గిప్సన్ చర్చి సభ్యులు వినోద్‌జోషి రూ.3 వేలు, రన్నర్స్‌కు రూ.2 వేలు ప్రోత్సాహక నగదు అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల డీఎస్ఏ కోచ్ సుదర్శన్, సీనియర్ హాకీ క్రీడాకారులు ప్రవీణ్, సత్యకుమార్, మాధవరావు, తులసీరామ్, ఈశ్వర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, ఒక్కడు, 18 పేజెస్, ధమాకా, మైఖేల్ గ్యాంగ్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : 18 పేజెస్, ధమాకా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ధమాకా, మైఖేల్ గ్యాంగ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్
భరత్ కాంప్లెక్స్ : ఒక్కడు
రాజ్ : ధమాకా
శ్రీరామ : ఒక్కడు
విజయ : 18 పేజెస్

జగనన్న 'చేయూత'తో వ్యాపారం

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో మహిళ చాకలి ఎల్లమ్మ
- పెద్ద పడఖానలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



పెద్ద పడఖానలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): 'జగనన్న అందిస్తున్న వైఎస్ఆర్ చేయూతతో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నానని ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్‌తో పెద్ద పడఖానకు చెందిన చాకలి ఎల్లమ్మ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే 8వ వార్డులో వివిధ శాఖల అధికారుల కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పెద్ద పడఖానలో వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను లబ్ధిదారులకు అందించారు. వార్డులో ఉన్న చాకలి ఎల్లమ్మను పలకరించగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు చేయూత పథకం ద్వారా రూ.18,750, ఆసరా కింద రూ.3722, మూడేళ్లలో వైఎస్ఆర్ పింఛన్ కింద రూ.82 వేలు తన బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. దీనితో పాటు రూ.6 లక్షల ఇంటి స్థలం, మొత్తం రూ.7,04,472 మంజూరు చేశారని ఆనందాన్ని వ్యక్తం చేసింది. దీంతో తమ కుటుంబం ఆర్థికంగా ఎదుగుతోందని తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. పేదలు ఆర్థికంగా ఎదగాలంటే సంక్షేమ పథకాలు చాలా అవసరం అన్నారు. సీఎం జగన్ వీటిని ఎంతో పారదర్శకంగా అమలు చేస్తున్నారని, నేరుగా అర్హులైన వారి ఖాతాలో పథకాల నగదు జమ చేస్తుండడంతో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పోయిందని చెప్పారు. పథకాల కోసం ఎవరి వద్దకు తిరగాల్సిన అవసరం లేదని, అర్హతే ప్రమాణికంగా వీటిని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు అబ్రార్, పార్టీ నాయకులు షాకీర్, ఫారూక్, యూసుఫ్, బాసిత్, డాక్టర్ శేషన్న, ఫిరోజ్, షబ్బీర్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని మాజీ ఎమ్మెల్యే, ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నార. 21వ జాతీయ స్థాయి సాంస్కృతిక మేళాలో భాగంగా ఆదివారం కృష్ణానగర్ రైల్వే గేట్ సమీపంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జాతీయ స్థాయి ఆధునిక నృత్య పోటీలు జరిగాయి. పోటీలను ప్రారంభించిన ఎస్వీ మోహన్‌రెడ్డి.. మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన కళా నైపుణ్యాలను వెలికి తీసి ప్రోత్సహించేందుకు పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారు వివిధ రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. కర్నూలు నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న మానసిక ఒత్తిడి తగ్గించడానికి సాంస్కృతిక పోటీలు ఉపయోగ పడతాయన్నారు. కళా ప్రతిభను ప్రదర్శించడానికి ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ చక్కని వేదికను ఏర్పాటు చేసిందన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు ఎస్వీ విజయమనోహరి, ఎస్వీ జనక్ దత్తారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. ఎస్వీ సుబ్బారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు తమ నృత్య కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి నాగలక్ష్మి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ రాఘవేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్స్ సంఘం నూతన అధ్యక్షుడిగా శివరామ్‌గౌడ్

- గౌరవాధ్యక్షుడిగా కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



నూతనంగా ఎన్నికైన కర్నూలు కేబుల్ ఆపరేటర్స్ సంఘం సభ్యులు

కర్నూలు (టౌన్): కేబుల్ ఆపరేటర్స్ సంఘం నూతన అధ్యక్షుడిగా శివరామ్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానికంగా ఒక హోటల్‌లో కర్నూలు కేబుల్ ఆపరేటర్స్ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన సంఘం గౌరవాధ్యక్షుడిగా కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వ్యవహరిస్తారు. సందడి సుధాకర్ (వర్కింగ్ ఉపాధ్యక్షులు), సోమేష్, ఖాదర్‌బాష, రత్నం (ఉపాధ్యక్షులు), శ్రీరామ్ (కార్యదర్శి), నాగరమణ, రాజు (సంయుక్త కార్యదర్శి), రమేష్ (కోశధికారి) కార్యవర్గ సభ్యులుగా ప్రకాష్, శ్రీనివాసులు, శంకర్, జితేందర్, జనార్దన్, వెంకటేష్ యాదవ్, లక్ష్మీనారాయణ, నాగిరెడ్డి, ప్రసాద్, రాంమోహన్‌లు ఎన్నుకున్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలి



రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్న జిల్లా షూటింగ్ బాల్ జట్టు

కర్నూలు (టౌన్): ఈ నెల 14వ తేదీ కృష్ణా జిల్లా విజయవాడ పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు అతిథులుగా హాజరైన వీరిరువురు క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులుగా ప్రతిభ చాటే వారికి ప్రభుత్వం నుంచి మంచి ప్రోత్సాహం ఉందన్నారు. కార్యక్రమంలో షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, నాగరాజు, పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): మాజీ రాష్ట్ర మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆయన నివాసంలో కుమారుడు ఎస్వీ మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

విత్తనోత్పత్తిలో జాగ్రత్తలు తీసుకోండి



మాట్లాడుతున్న విశ్రాంత వ్యవసాయ అధికారి రామరాజు

కర్నూలు(అగ్రికల్చర్): విత్తనోత్పత్తిలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని నంద్యాల ప్రాంతీయ పరిశోధన కేంద్రం విశ్రాంత వ్యవసాయ అధికారి రామరాజు తెలిపారు. ఆదివారం ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన విత్తనోత్పత్తి, విత్తన ధ్రువీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలంటే విత్తనం ఎంపిక కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. విత్తనోత్పత్తికి మూల(బ్రీడర్) విత్తనం వాడాలని, దీని నుంచి ఫౌండేషన్ సీడ్ వస్తుందని తెలిపారు. విత్తనోత్పత్తికి ఫౌండేషన్ సీడ్ వినియోగిస్తే దాని నుంచి సర్టిఫైడ్ సీడ్ వస్తుందన్నారు. విత్తనంలో జన్యు స్వచ్ఛత, తేమ తగిన స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు. విత్తన ఉత్పత్తిలో ఐసోలేషన్ దూరం, కలుపు యాజమాన్యం తదితర వాటిని పాటించాలని సూచించారు. రైతులకు విత్తనోత్పత్తిపై తగిన అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌పుట్ డీలర్లతో పాటు దేశీ శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

ముగ్గుల పోటీకి విశేష స్పందన



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కర్నూలు కల్చరల్: సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిర్డీ సాయినాథుని దేవస్థానం వద్ద నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా అందమైన రంగవల్లులను తీర్చిదిద్దిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకూ చీరను బహూకరించారు. మండలి ప్రధాన కార్యదర్శి మహాబలేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సభ్యులు కుమార్, ప్రవీణ్, జగదీష్, కృష్ణ, నాగశేను పాల్గొన్నారు.

జిల్లా వాసికి విశిష్ట పురస్కారం



తెలుగు తేజం జాతీయ విశిష్ట పురస్కారం అందుకుంటున్న మద్దిలేటి

కర్నూలు కల్చరల్: తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా పుడమి సేవా సంస్థ కర్నూలు నగరానికి చెందిన డాక్టర్ ఎస్.కె.మద్దిలేటికి తెలుగు తేజం జాతీయ విశిష్ట పురస్కారం ప్రదానం చేసింది. సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా నల్లగొండలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవుల వారసులు సాహితీ వేత్తలు డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మ, కంచర్ల శ్రీనివాస రావు, మున్నెల్లి శివశంకరయ్య, గిడుగు వెంకట నాగేశ్వరరావు, డాక్టర్ ఏనుగు శివరామ ప్రసాద్‌ల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. పురస్కారం అందుకున్న మద్దిలేటికి పలువురు సాహితీ వేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం



రవీంద్ర పాఠశాల పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్: రవీంద్ర పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం త్రిగుణ క్లార్క్‌లో జరిగింది. 1996 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు అందరూ 25 ఏళ్ల తరువాత ఒక చోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యార్థి దశలోని మధురానుభూతులను నెమర వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పి ఉన్నతులుగా తీర్చిదిద్దిన గురువులను ఘనంగా సన్మానించారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి క్రమశిక్షణ, పట్టుదల, సర్దుబాటు చాలా అవసరం అన్నారు. కార్యక్రమంలో గురువులు పత్తి ఓబులయ్య, పి.బి.వి.సుబ్బయ్య, రమణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుతో గాయని సరస్వతికి అనుబంధం



సరస్వతి(ఫైల్)

కర్నూలు కల్చరల్: తొలితరం గాయని, నటి, తెలుగు తమిళ భాషల్లో అనేక పాటలు పాడిన టి.జి. సరస్వతి (95) ఆదివారం తిరుచునాపల్లిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె ఘంటసాల సంగీతంలో అనేక పాటలు పాడారు. అలనాటి నటీమణులు సావిత్రి, అంజలీదేవి వంటి వారికి ప్లేబ్యాక్ సింగర్‌గా ఉన్నారు. ఇటీవల పద్మశ్రీ ఘంటసాల శత జయంతి ఉత్సవాల సందర్భంగా కర్నూలులో పద్మశ్రీ ఘంటసాల జీవిత సాఫల్య స్మారక పురస్కారం ప్రదానం చేశారు. ఆమె మృతి పట్ల మధుర కవి ఎలమర్తి రమణయ్య, ఘంటసాల గాన సభ సభ్యులు సంతాపం ప్రకటించారు.

అగ్ని ప్రమాదం

- రూ.6 లక్షల ఆస్తి నష్టం

కర్నూలు (టౌన్): నగరంలోని వెంకటరమణ కాలనీ సమీపంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అక్కడే ఉన్న కొట్టంతో పాటు పక్కనే ఉన్న కారు పూర్తిగా కాలిపోయాయి. మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అగ్ని మాపక శాఖ అధికారులు ఏడీఎఫ్ఓ చిన్నబజారి, భాస్కర్‌రెడ్డి, ఫైర్‌మెన్ రవీంద్రనాథ్, హోంగార్డులు మహేష్, హనుమంతులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంపై ఆరా తీశారు. ఉద్దేశపూర్వకంగానే గుర్తు తెలియని వ్యక్తులు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మరింత దర్యాప్తు చేస్తున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. అలాగే శరీన్‌నగర్ సమీపంలోని వెంకటాద్రినగర్‌లో గడ్డివాము అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనలో రూ.30 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

20 నుంచి భక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర 5వ భక్తి సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.జి.శరత్ చంద్రబాబు తెలిపారు. వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో 20 నుంచి 22వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు జరి గే సమ్మేళనంలో 18 మంది స్వామీజీలు, రాష్ట్రంలో ఉన్న రామకృష్ణ సేవా సమితిల ప్రతినిధు లు, సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ సమ్మేళనానికి కన్వీనర్‌గా శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఎస్ఆర్‌కేవీబీపీపీ) రాయలసీమ కన్వీనర్ డాక్టర్ పి.పి.వి.డి. నాగత్రిశూల పాణి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా గోకారి



ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు కల్చరల్: ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా గోకారి ఎన్నిక కావడం పట్ల ఎస్టీయూ నాయకులు హర్షం ప్రకటించారు. ఆదివారం సలాంఖాన్ భవన్‌లో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ముధాసిర్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజులు అభినందించారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్

పాణ్యం: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పాణ్యం మండలంలో ఆర్‌జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. పాణ్యం సీఐ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, 20 మందికి పైగా పోలీసులు రెండు కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు. ఆర్‌జీఎం కాలేజ్ సెంటర్‌లో మొత్తం 750 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 570 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. అలాగే శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో 554 మంది గాను 171 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు.

పెంచిన కూలీరేట్లను అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై గోదాముల్లో పని చేసే హమాలీలకు పెంచిన రేట్లను అమలు చేయాలని సివిల్ సప్‌లై కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బజారి డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో ఆయన మాట్లాడుతూ..గతేడాది 2022 జనవరి 1వ తేదీన సివిల్ సప్‌లై కార్మికుల కూలీ రేట్లను పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఇంతవరకు వాటిని అమలు చేయకపోగా అందుకు సంబంధించిన జీఓను విడుదల చేయలేదన్నారు. అలాగే స్వీపర్లు, ఇతర కూలీలకు వేతనాలు పెంచాలని ఈ నెల 9,10,11 తేదీల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

బతుకమ్మ మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని కారల్ మార్క్స్ నగర శాఖ కార్యదర్శి బతుకమ్మ ఆదివారం అనారోగ్యంతో చనిపోయింది. ఆమె మృతికి సీపీఐ సంతాపం ప్రకటించింది. పార్టీ నాయకులు మునెప్ప, మనోహర్‌మాణిక్యం ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం కృషి చేస్తామన్నారు.

ట్రాఫిక్ సర్కిల్ ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): సుందర్య వై జంక్షన్‌లో ట్రాఫిక్ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కొందరు పోలీసులు ట్రాఫిక్ సర్కిల్ లేకపోవడంతో ఇందిరానగర్, వెంకటరణకాలనీల నుంచి కొత్తబస్టాండ్ వైపు వెళ్లే వాహనాల ఫొటోలు తీసి చలాన్లను జనరేట్ చేస్తుండడంతో స్థానికులు ఆగ్రహించారు. వారికి డీవైఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. పోలీసులతో వాగ్వాదం చేశారు. సర్కిల్ లేకపోవడంతోనే వాహనాలు రాంగ్‌రూట్‌లో వెళ్లాల్సి వస్తోందని, దానిని పోలీసులు అదనుగా భావించి జరిమానా విధించడం భావ్యం కాదన్నారు.

మగ్గం వర్క్‌తో మహిళలకు ఉపాధి

కర్నూలు(అర్బన్): నగరంలోని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన మహిళలకు కంప్యూటర్ ద్వారా మగ్గం వర్క్‌పై ఉపాధి పొందేందుకు శిక్షణ ఇస్తున్నట్లు రాజ్‌కుమార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు రత్నకుమారి తెలిపారు. స్థానిక అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని తమ కార్యాలయంలో ఈ శిక్షణను ఇస్తున్నట్లు ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మగ్గం వర్క్‌తో పాటు బ్యూటీషియన్ కోర్సు, కుట్టు మిషన్ నేర్పించడం జరుగుతుందన్నారు. కనీస ఫీజుతో మహిళలకు శిక్షణ ప్రారంభమైందని, ఆసక్తి కలిగిన మహిళలు మరిన్ని వివరాలకు 7569325354 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షునికి అభినందన

కర్నూలు కల్చరల్: వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణను ప్రత్యేకంగా అభినందించారు. వీహెచ్‌పీ హితచింతక్ (సభ్యత్వం)ను అత్యధికంగా చేయించినందుకు ఆదోనిలో శ్రీవాసవీ కన్వెన్షన్‌లో జరిగిన దక్షిణాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమావేశాల్లో ఆదివారం వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త మహామంత్రి స్థాణు మిలియన్, రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, కార్యదర్శి కాకర్ల రాముడు గోరంట్ల రమణను అభినందించారు.

విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేయొద్దు

కర్నూలు(సెంట్రల్): కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో నిర్వీర్యం చేసే ప్రయత్నం మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. 200 యూనిట్లు దాటిన ప్రతి మీటర్ స్థానంలో స్మార్ట్ మీటర్‌ను బిగించాలని నిర్ణయించడాన్ని ఆయన ఖండించారు. దీనివల్ల వినియోగదారుడిపై అదనంగా రూ.13 వేల భారం పడుతుందన్నారు. ఇప్పటికే ట్రూ ఆఫ్ చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు.

క్రీడల్లో భాగస్వాములు కావాలి

కర్నూలు (టౌన్): ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలని కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో రాజస్థాన్ ప్రీమియర్ లీగ్-9 క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉంటూ ఒత్తిడికి గురయ్యే వారు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. కర్నూలు రాజస్థాన్ ప్రీమియర్ లీగ్, వైశ్యులు, మార్వాడీలు, జైనులు లీగ్ పోటీలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కై లాష్, ఆర్యన్, హితేష్, రంజిత్, సురేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు ఏడీఈగా నాగేంద్ర ప్రసాద్

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆలూరు ఆపరేషన్స్ ఏడీఈగా డీవీ నాగేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. కర్నూలు సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ చౌర్యం నివారణ విభాగం ఏఈగా పనిచేస్తున్న ఈయనకు ఏడీఈగా పదోన్నతి కల్పించి ఆలూరుకు బదిలీ చేశారు. ఈ మేరకు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.